స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బలోపేతానికి కృషి : కలెక్టర్

భీమవరం: జిల్లాలో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళలు, శిశువుల ఆరోగ్యంలో స్త్రీ, సంక్షేమ శాఖ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. గర్భిణులు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం అందించడం, అంగన్వాడీలకు ప్రత్యేక ఆహారాన్ని అందించడం, ఎదుగుదల, బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరచడం, వారికి అవసరమైన పౌష్టికాహారంతో పాటు వైద్య సదుపాయం అందించడం తదితర సేవలలు ఆ శాఖ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నియామక కమిటీ సభ్యులైన జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జువైనల్ జస్టిస్ బార్ మెంబర్ డి.పద్మ పాల్గొన్నారు.

'స్మార్ట్'గా బిగింపు..!

జోరుగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ

రెండు జిల్లాల్లో 13.30 లక్షల విద్యుత్ కనెక్షన్లు

ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 6 వేలు, పశ్చిమలో 2 వేలు వరకూ బిగింపు

వ్యాపార దుకాణాలు, ఇళ్లకు సైతం అమరిక

ఇక నుంచి ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్.. భారీగా బిల్లులు వచ్చే అవకాశం

రెండో దశలో ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మార్పు చేసే వ్యూహం

అప్పుడు వ్యతిరేకించిన టిడిపి.. ఇప్పుడు మాత్రం ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకొచ్చాక అందుకు భిన్నంగా ముందుకు సాగుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వేగంగా సాగిస్తోంది. ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక ప్రక్రియ వేగంగా సాగుతోంది. 2025 మార్చి నాటికి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కమర్షియల్ కనెక్షన్లు 54,600 ఉండగా, గృహ విద్యుత్ సర్వీసులు 4.57 లక్షలు, మిగిలినవి ఇతర కనెక్షన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 7.30 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కమర్షియల్ కనెక్షన్లు 55 వేలు వరకూ ఉండగా మిగిలినవి గృహ, ఇతర సర్వీసులు ఉన్నాయి. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును రెండు జిల్లాల్లోనూ ప్రారంభించింది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఆరు వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో రెండు వేల కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేశారు. ముందుగా వ్యాపార దుకాణాలకు మాత్రమే అంటూ ప్రారంభించి ఇళ్లకు సైతం బిగింపు ప్రక్రియను మొదలుపెట్టారు. దీనికోసం ప్రత్యేక బృందాలు సైతం పని చేస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపుతో వ్యాపారస్తులు, గృహ వినియోగదారులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల బిగింపుతో పరిస్థితి ఎలా ఉంటుందోననే భయం అందరినీ వెంటాడుతోంది. స్మార్ట్ మీటర్ల అమరికకు సంబంధించిన వ్యవహారమంతా అదానీ కంపెనీకే ఇచ్చిన పరిస్థితి నెలకొంది.

ప్రీ పెయిడ్‌కు మార్చే వ్యూహంతో ముందుకు

ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల బిగింపు మాత్రమే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు ప్రణాళిక రచించారు. విశాఖపట్నంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యూహాత్మకంగా స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ చేపట్టింది. ప్రీపెయిడ్ మీటర్లను కాదని కేవలం స్మార్ట్‌మీటర్లు మాత్రమే బిగిస్తున్నట్లు చెబుతున్నారు. కొంతకాలం తర్వాత ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చే వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం బిగిస్తున్న మీటర్లతో ఇకనుంచి నేరుగా ఇంటికి వచ్చి విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేసి బిల్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. కార్యాలయం నుంచే అధికారులు ఆన్‌లైన్‌లోనే జిల్లాలోని అన్ని కనెక్షన్లకు ఒకేసారి బిల్లును జనరేట్ చేసి ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపిస్తారు.



ఏలూరులోని బుక్ షాపులో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్

స్మార్ట్‌మీటర్లకు సెన్సార్ ఉంటుంది. దీంతో ఎన్ని యూనిట్లు వాడారో అధికారులకు ఆన్‌లైన్‌లోనే రీడింగ్ తెలుస్తుంది. ప్రీపెయిడ్ మీటర్లుగా మార్పు చేస్తే ఫోన్ రీఛార్జి మాదిరిగా ముందుగానే విద్యుత్ రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. స్మార్ట్‌మీటర్ల బిగింపుతో విద్యుత్ రీడింగ్ తీసే ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోనున్నారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్ల కారణంగా విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండనుంది. ఇప్పటికే విద్యుత్ బిల్లులు కట్టలేక జనం అల్లాడిపోతున్నారు. 300 యూనిట్లు దాటితే ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల కారణంగా బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటీవల భీమవరం వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెప్పారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా సాగుతోంది. వినియోగదారుల అంగీకారంతో సంబంధం లేకుండానే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ సాగుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపుపై పశ్చిమగోదావరి జిల్లా విద్యుత్ శాఖ అధికారిని వివరణ కోరగా ఇప్పటి వరకూ జిల్లాలో రెండు వేల పైచిలుకు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించినట్లు తెలిపారు. ఏలూరు జిల్లా విద్యుత్ శాఖాధికారులు ఆరు వేలు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు వివరించారు.

ప్రజాపాలన కాదిది.. రాక్షస పాలన

ఐ.భీమవరం రోడ్డులో ఇళ్ల కూల్చివేతపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రస్తుతం ఉండి నియోజకవర్గంలో ప్రజాపాలన లేదని, రాక్షస పాలన సాగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. మండలంలోని ఐ.భీమవరం గ్రామంలో రోడ్ల పక్కనే ఉన్న ఇళ్ల తొలగింపు కార్యక్రమాన్ని నిరసిస్తూ సిపిఎం చేపట్టిన ఆందోళనలో మంగళవారం సాయంత్రం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకివీడు పొలిమేర నుండి సంఘటనా స్థలం వరకు బాధితులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో గోపాలన్ మాట్లాడారు. రఘురామకృష్ణంరాజు నుంచి రఘురాముని పాలన ఆశించామని, దానికి విరుద్ధంగా రాక్షస పాలన సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ ఎంఎల్‌ఎ కూడా ఇంత దుర్మార్గం చేయలేదన్నారు. ఇళ్ల ఖాళీకి సమయం కోరడంతోపాటు ఇళ్ల స్థలాలు కేటాయించిన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ స్థలాలిస్తాం, ఇళ్ల పట్టాలిస్తాం, ఇల్లు కట్టించి ఇస్తాం అంటూ ఇచ్చిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నారు. ఇల్లు పీకేసి అభివృద్ధి అనుకుంటే అది తిరోగమనమన్నారు. నిర్వాసితులకు పట్టాలిచ్చి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంఎల్‌ఎ ఇంటి ముందే దీక్షలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గొర్ల రామకృష్ణ, బివి.వర్మ, బి.రాంబాబు, ధనుష్, రవితేజ, డోకల లక్ష్మి, ఎస్.ఉదయకుమారి, సందక సూరిబాబు తదితరులు మాట్లాడారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పేదలు, నేతలు

ఐ.భీమవరం రోడ్లో ఇళ్ల కూల్చివేత దారుణం

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఆకివీడు మండలం ఐ.భీమవరం రోడ్డులో దశాబ్దాలుగా రోడ్డు పక్కనే నివాసముంటున్న పేదల ఇళ్లను ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు ఆదేశాలతో అన్యాయంగా కూల్చివేయడం దారుణమని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్‌లో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని చెప్పుకుంటూనే పేదల నివాసాలను కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. పేదల ఓట్లతో గెలిచిన ఎంఎల్‌ఎ పేదలపై యుద్ధం చేయడం సమంజసం కాదన్నారు. మూడు నెలలు సమయం కావాలని, కేటాయించిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలని వేడుకున్నా కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఇళ్లు కూల్చివేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎంఎల్‌ఎ ఆదేశాలతో అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం, పేదలకు అండగా ఉన్న సిపిఎం నాయకులను గృహనిర్బంధాలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

అందినంత అందుకో.. దొరికినంత దోచుకో..!

కాసులిస్తేనే సంతకం.. లేకపోతే ఫైల్ రిజెక్ట్

ఆ తహశీల్దార్ కార్యాలయంలో ముగ్గురు అధికారుల తీరే వేరు

జాయింట్ ఎల్‌పిఎంలు విడదీసేందుకు రూ.4 వేల వరకూ వసూళ్లు

ఎఫ్ఎంసి, మ్యూటేషన్‌కు ప్రత్యేక ధర

లబోదిబోమంటున్న రైతులు

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పాలకోడేరు మండలంలో దుస్థితి

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి సర్వే నెంబర్లు (జాయింట్ ఎల్‌పిఎం) విడదీసేందుకు ఒక రేటు.. ఎఫ్ఎంసికి మరో రేటు.. మ్యుటేషన్ చేయాలంటే దానికి ప్రత్యేకమైన ధర.. ఏ పనికైనా కాసులిస్తేనే ఫైల్‌పై సంతకం.. లేకపోతే ఆ ఫైల్ రిజెక్ట్.. ఈ తతంగమంతటికీ వేదిక జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయమే. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పాలన సాగించాలని కూటమి ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరికలు కూడా చేసింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు కూడా తరచూ అధికారులతో సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలి తప్ప వేరే ఆలోచన ఉండకూడదని చెబుతున్నా పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయంలోని కొందరు అధికారులకు మాత్రం ఇవేమీ పట్టట్లేదు. ఎవరెన్ని చెప్పినా.. ఏమనుకున్నా.. అందినంత అందుకో.. దొరికినంత దోచుకో అనే చందంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇటీవల బదిలీపై వచ్చిన అధికారుల్లో ఇద్దరు అధికారులు, గతం నుంచి పని చేస్తున్న మరొక అధికారి తీరు పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో కొన్ని తప్పులు దొర్లాయి. చెరువులుగా ఉన్న పొలాలకు గట్లు తెలియక, ఉమ్మడి ఆస్తిని కుటుంబ సభ్యులు పంచుకున్నా రికార్డుల్లో లేకపోవడం, పొలం ఇక్కడ ఉండి యజమానులు వేరే ప్రాంతంలో ఉంటే వారి వివరాలు తెలియకపోవడంతో రీసర్వే అధికారులు వారందరికీ ఉన్న ఆయకట్టు మొత్తానికి జాయింట్ ఎల్‌పిఎంలు ఇచ్చారు. వాస్తవానికి ఇది అధికారులు చేసిన తప్పిదం. అయితే ఇటీవల నిర్వహించిన రీసర్వే గ్రామసభల ద్వారా జాయింట్ ఎల్‌పిఎంలను విడదీసుకోవడానికి రైతులు పెద్దమొత్తంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే పని జరగాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని ముగ్గురు అధికారులు చెబుతున్నట్లు గ్రామస్థాయి అధికారులు ఆరోపిస్తుండటం గమనార్హం. దీంతో రైతుల నుంచి దరఖాస్తుకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ మొత్తాన్ని హోదాను బట్టి రూ.వెయ్యి చొప్పున ముగ్గురు అధికారులు తీసుకోవడంతోపాటు మరో రూ.వెయ్యి గ్రామస్థాయిలో అధికారులు తీసుకుంటున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఒకవేళ సంబంధిత రైతు వద్ద డబ్బులు సమకూరకపోయినా, లేక ఇవ్వలేకపోయినా దరఖాస్తులను రకరకాల సాకులు చూపి సంతకాలు చేయకుండా అట్టిపెట్టుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రీసర్వేలో అధికారులు చేసిన తప్పులను సరిచేయకుండా తిరిగి డబ్బులు ఇవ్వాలనడం ఎంతవరకు న్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల కోరుకొల్లు గ్రామానికి చెందిన ఒక రైతు, విస్సాకోడేరుకు చెందిన మరో రైతు మ్యుటేషన్ నిమిత్తం ఐదు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఈ ముగ్గురు అధికారుల్లో ఒక అధికారి ఎకరానికి రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ అవుతుందని చెప్పినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. వేండ్ర గ్రామానికి చెందిన మరో రైతు ఎఫ్ఎంసికి దరఖాస్తు చేసుకుంటే రూ.2 వేలు అవుతుందని చెప్పినట్లు తెలిసింది. ఇటీవల గరగపర్రులో రీసర్వే గ్రామసభ జరిగిన తర్వాత కూటమి నేతలు, రైతులు ఎల్‌పిఎంలు విడదీయడానికి సొమ్ము అడుగుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మోగల్లు గ్రామసభలో సైతం సొమ్ము అడుగుతున్నారని రైతులు వాపోయారు. చివరకు కూటమి నేతలకూ ఈ ఇబ్బందులు తప్పని పరిస్థితి. కూటమి నేతలనే డబ్బులు అడగడంతో ఖంగుతిన్న పరిస్థితి ఉంది. కూటమి నేతలు చెప్పినా వినే పరిస్థితుల్లో ఆ ముగ్గురు అధికారులూ లేరనే విమర్శలు విన్పిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారం ఎంఎల్‌ఎ కార్యాలయం దృష్టికి వెళ్లడంతో ఒక నేత అధికారులను మందలించినట్లు తెలిసింది. ఎంఎల్‌ఎ దృష్టికి వస్తే బాగుండదని, పద్ధతి మార్చుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే ఇది నేతలకు ఉపశమనం కల్గించినా రైతులకు మాత్రం వసూళ్ల బెడద తప్పని పరిస్థితి ఉందని సమాచారం. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సంబంధిత అధికారులను విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అయితే జిల్లా కేంద్రానికి అతి దగ్గరలోనే ఉన్న పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయ అధికారుల తీరుపై జిల్లా అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయం

7, 8 తేదీల్లో అంతర్ కళాశాల బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 7, 8 తేదీల్లో స్థానిక డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో అంతర్ కాలేజీ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శోభారాణి తెలిపారు. పోటీలను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభిస్తారన్నారు. ఈ పోటీల ద్వారా నన్నయ యూనివర్సిటీ టీమ్‌ను కూడా ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీల ప్రారంభోత్సవంలో నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, గోపన్నపాలెం ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ఎస్.నతానియేల్ పాల్గొంటారని చెప్పారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

యుటిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మంగళవారం నరసాపురం పట్టణం, మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను, వైఎన్ కళాశాల, స్వర్ణాంధ్ర కళాశాలల్లో అధ్యాపకులను కలిశారు. రానున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రయివేటు టీచర్స్, ప్రభుత్వ రంగ ఉపాధ్యాయుల సమస్యలపై సూటిగా ప్రశ్నించేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనన్నారు. తాను విద్యార్థి దశ నుండి ఎన్నో సమస్యల మీద పోరాడానని, ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొంటూ ఉద్యోగులకు అండగా నిలిచానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, అధ్యక్షులు పి.విజయరామరాజు, జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమార్, మున్సిపల్ కన్వీనర్ ఎం.లక్ష్మీనారాయణ, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్, ఎం.మాణిక్యాలరావు, చంద్రకుమార్, సిహెచ్.కృష్ణ మోహన్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల నిరసనలు

పెనుగొండలో..

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంపేట సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అనేకమంది ఆశా వర్కర్లను రిటైర్మెంట్ చేశారన్నారు 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాల వరకూ వయసు పెంపుదల జిఒ రాకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదన్నారు. జిఒలు విడుదల చేయాలని ఈ నెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ చేసిన నిర్ణయాన్ని తమకు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం తక్షణం సమస్యల పరిష్కార ఒప్పంద జిఒలు జారీ చేయాలని కోరారు. అనంతరం పిహెచ్‌సి డాక్టర్ లక్ష్మీపార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పి.బేబీకుమారి, బి.దేవి, కె.విజయలక్ష్మి, ఎల్.ఆశాజ్యోతి, ముచ్చలమ్మ, అశ్విని పాల్గొన్నారు.

నరసాపురం : ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం లింగనబోయిన చర్ల పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 9 నెలలు కావస్తున్నా జిఒలు విడుదల కాకపోవడంతో ఆశా వర్కర్లు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం సమస్యల పరిష్కారానికి ఒప్పంద జిఒలు జారీ చేయాలన్నారు. అనంతరం పిహెచ్‌సి వైద్యురాలు మాధురికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.రత్నకుమారి, ఎం.విజయ కుమారి, బి.మణికుమారి, బి.జయలక్ష్మి, ఎన్.చిన్నారి పాల్గొన్నారు.

పెనుగొండ : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ వెంకటలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల నాయకురాలు కంకిపాటి లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి బెనిఫిట్స్ లేకుండా కేవలం తీసుకుంటున్న వేతనంతోనే ఉద్యోగ విరమణ చేస్తున్న ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని జిఒ ఇవ్వాలన్నారు. ఎండనకా వాననకా కష్టపడి పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీసం సెలవు అడిగితే ఇవ్వని పరిస్థితి ఉందని, దీనిని వ్యతిరేకిస్తూ అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుమంత్ర: గతంలో కుటుంబ సంక్షేమ శాఖ, ఆశా వర్కర్ల మధ్య జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేసి, ఆశాలను ఆదుకోవాలని ఆశా వర్కర్ల (సిఐటియు) యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి దిగుబాటి జ్యోతి కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం.మల్లికకు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, అప్పుడు జరిగిన ఒప్పందంలో అంగీకరించిన అన్ని డిమాండ్లనూ అమలు చేయాలని కోరారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

పెనుమంత్ర : వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

మొగల్తూరులో..

ఎపి నిట్ అభివృద్ధికి కృషి చేస్తా

ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు తెలిపారు. చత్తీష్‌ఘడ్‌లోని రాయపూర్ నిట్ డైరెక్టర్ రమణారావును ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఎపి నిట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన సాగించేలా చర్యలు తీసుకోవడంతోపాటు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ విద్యా సంస్థ పురోభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించి వారికి పలు సూచనలిచ్చారు. ప్రాంగణంలోని భవన సముదాయాలను పరిశీలించారు. ముందుగా నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి రమణారావుకు స్వాగతం పలకగా, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి ఫ్యాకల్టీ తరపున పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు

ఓటు వజ్రాయుధం : తహశీల్దార్

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీతో పట్టభద్రులు ఓటర్ల నమోదుకు ఆఖరి తేదీ అని, అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. 31 అక్టోబర్ 2021 ముందు పట్టభద్రులు డిగ్రీ కలిగి ఉంటే వెంటనే తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానంలో ఉపఎన్నిక డిసెంబర్ 5న నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. శాసనమండలిలో నమోదు కావడానికి 01-11-2024 తేదీ నాటికి మూడు సంవత్సరాల ముందు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమా పొందిన వారు ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. నమోదు కోసం ఫారం 18 జతపర్చాలని ధ్రువీకరించబడిన గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమా సర్టిఫికెట్ నకలు, అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ గుర్తింపు కార్డు నకలు జతపరచాలన్నారు. ఓటు నమోదు ఆఖరి తేదీ ముగియనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలన్నారు.



పైప్‌లైన్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రతి ఇంటిలో తాగునీరు రావాలి
ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ట్యాప్ తిప్పితే ప్రతి ఇంటిలో తాగునీరు రావాలని, శివారు ప్రాంతానికి కూడా తాగునీరందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ పులపర్తి అంజిబాబు అన్నారు. మంగళవారం వెంపలో సుమారు రూ.37.95 లక్షలతో జల జీవన్ మిషన్‌లో భాగంగా మైక్రో ఫిల్టర్ ప్రారంభించగా, సుమారు రూ.72 లక్షలతో పైపులైన్ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేసి మాట్లాడారు. త్వరలోనే అన్ని పనులూ పూర్తి చేస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి తలెత్తకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇంజేటి రాజేశ్వరి, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎంపిటిసి చీలకపాటి కుమారి, ఉప సర్పంచి కలిదిండి చిన బంగార్రాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహనుండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆన్‌లైన్ మోసాల పట్ల అందరూ అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని యూనియన్ బ్యాంకు మార్టేరు శాఖ బ్రాంచి మేనేజర్ రమేష్ కుమార్ కోరారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా మార్టేరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. బ్యాంకు ఖాతా దారులకు ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఎకౌంటు నంబర్ గాని,ఎ ఒటిపిలు, ఆధార్ నంబర్ తదితర విషయాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సిహెచ్ చిన్న సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఫణీంద్ర, చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేషన్ వాహనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజకిషోర్

రేషన్ డిపోల తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని చౌక డిపో దుకాణాలను తహశీల్దార్ కె.రాజకిషోర్ మంగళవారం సందర్శించారు. 9, 11 నంబర్ గల చౌక డిపో దుకాణాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయా దుకాణాల్లో ఉన్న బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వలను పరిశీలించారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్‌పి

వ్యాసరచన పోటీల్లో విద్యావికాస్ విద్యార్థిని ప్రతిభ

ఆకివీడు :స్థానిక విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థిని లాభాల రాజ్యలక్ష్మి 'సైబర్ నేరాలపై అవగాహన' అనే అంశంపై పోలీసులు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా ఉత్తమ బహుమతి అందుకుంది. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాజ్యలక్ష్మి పాల్గొని విజయం సాధించింది. జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ బలరాంబాబు తెలిపారు. రాజ్యలక్ష్మిని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు యాజమాన్యం, డైరెక్టర్లు అభినందించారు.

జీవన శైలి మార్చుకోవాలి

ఉండి:సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి వ్యక్తీ జీవనశైలి మార్చుకున్న నాడు కేన్సర్ బారిన పడకుండా ఉండొచ్చని ఉండి పిహెచ్‌సి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. మంగళవారం ఉండి జెడ్‌పి హైస్కూల్లో ఛైల్డ్ కేన్సర్ అవేర్నెస్ కార్యక్రమం జరిగింది. సభకు పాఠశాల హెచ్‌ఎం వై.రామలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి చంద్ర మాట్లాడుతూ పిల్లల్లో లుకేమియా, మెదడు, వెన్నుపాము కణితులు, లింపోమా తదితర కేన్సర్లు వస్తాయని, ప్లాస్టిక్ వినియోగం, జంక్ ఫుడ్స్ తినడం మానాలన్నారు. లయన్ గొట్టుముక్కల రాము సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సత్తి బ్రహ్మా రెడ్డి, కార్యదర్శి ముదునూరి శివరామరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, కలిదిండి సీతారామరాజు పాల్గొన్నారు.



డాక్టర్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాగునీటి చెరువు కలుషితం..!

చనిపోతున్న చేపలు - పట్టించుకోని అధికారులు - మత్స్యపురిపాలెం గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - వీరవాసరం



మత్స్యపురిపాలెంలో కలుషితమైన తాగునీటి చెరువు



చెరువులో చనిపోయిన చేపలు

వీరవాసరం మండలంలోని మత్స్యపురిపాలెంలో తాగునీటి చెరువు కలుషితమైంది. రెండు రోజులుగా కలుషిత నీరు వల్ల చెరువులోని చేపలు చనిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామంలోని డ్రెయిన్లలో మురుగునీరు చెరువులోకి చేరడంతో తాగునీటి చెరువు కలుషితమైందని స్థానికులు వివరిస్తున్నారు. చేపలు చనిపోవడంతో చెరువు వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. కొద్ది రోజుల క్రితం ఇక్కడ పని చేసిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. మరో కార్యదర్శి మహేష్ ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మరో కొత్త కార్యదర్శిగా ఇక్కడకు బదిలీపై వచ్చిన నరేష్ బాధ్యతలు చేపట్టారు. అయితే ఇప్పటివరకూ కొత్త కార్యదర్శికి బాధ్యతలు అప్పజెప్పకపోవడంతో గ్రామానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామస్తులు కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కార్యదర్శుల మధ్య రికార్డుల మార్పిడి జరగకపోవడంతో సర్పంచి కురెళ్ల వెంకట పద్మావతి ఏం చేయలేనంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ అవసరాలకు తన సొంత నిధులు ఖర్చు చేశామని, వాటికి సంబంధించి సుమారు రూ.లక్షా యాభై వేలు పంచాయతీ నుంచి తనకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే అనారోగ్యాలకు గురవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కార్యదర్శుల మధ్య నెలకొన్న విభేదాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని సర్పంచి తెలిపారు. ఐదు నెలలుగా గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ లేదు. రెండేళ్లుగా చేపల చెరువు పాట పెట్టకపోవడం, పన్నులు వసూలు చేయకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడింది. ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రాంతాలు డయేరియా బారిన పడ్డాయి. రెండు వేల జనాభా కలిగిన మత్స్యపురిపాలెంలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారే అవకాశం ఉందంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య విధానంలో కొత్త ఒరవడి : డాక్టర్ ప్రభాకర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైద్య విధానంలో కొత్త ఒరవడి, నరాల్లో రక్తం గడ్డ కట్టే విధానాన్ని నూతన వైద్య విధానంలో అరికట్టి నయం చేయొచ్చని, రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించవచ్చని యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్, ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం భీమవరం హర్ష డయాబెటిక్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నరాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల షుగర్ రోగులకు కాలు తొలగించాల్సి వచ్చేదని, అక్యూట్ ప్రాక్సిమల్ డివిటితో కూడిన పల్మనరీ ఎంబోలిజం (విటిఇ)కు కొత్త చికిత్స విధానాలతో సమస్యను అరికట్టవచ్చని తెలిపారు. ఈ వైద్యం ఇటీవలే వచ్చిందని, దీనిపై ప్రభుత్వం అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఓ పేషెంట్‌కు ఎండోవెనస్ విధానం ద్వారా మెకానికల్ థ్రోంబెక్టమీ చికిత్స చేశామని, చాలా వరకూ ప్రాణాంతకమైన గడ్డలు తొలగిపోయి ప్రాణాలకు ప్రమాదం తప్పిందని తెఇపారు. కార్యక్రమంలో సురేష్ గడ్డం, స్వామి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆదర్శనీయులకు సత్కారం అభినందనీయం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజంలో తమ పని తాము చేసుకుంటూ ఎటువంటి ప్రచారం కోరుకోని వ్యక్తులు ఉంటారని వారిని గుర్తించి అభినందించడం ద్వారా ఒక మంచి సందేశాన్ని విద్యా చైతన్య సమాఖ్య అందజేస్తోందని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆదర్శ వ్యక్తులకు జరిగిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి వ్యక్తులను గుర్తించడం ద్వారా సమాజంలో మరింత మంది స్ఫూర్తి పొంది ఆ దిశగా తమ కృషిని కొనసాగిస్తారన్నారు. తాను చేసే పనిని శ్రద్ధగా, సామాజిక బాధ్యతతో చేసేవారు ఆదర్శ వ్యక్తులవుతారన్నారు. సమాఖ్య ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యా చైతన్య సమాఖ్యను 2011లో ప్రారంభించామని, అప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణతో పాటు పరీక్షలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం వైద్యం, విద, బ్యాంకింగ్ రంగాల్లో పనిచేస్తున్న ఐదుగురు ఆదర్శ వ్యక్తులను గుర్తించి అభినందిస్తున్నామన్నారు. అనంతరం తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడుతున్న చల్లా మల్లికార్జునశర్మ, విద్యా రంగంలో విద్యార్థుల పట్ల ప్రేమ, శ్రద్ధ కనబరుస్తున్న ఉపాధ్యాయులు బుంగ జెస్సీ కళ, శెట్టి రామారావు, దొంగ చింతయ్య, బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న కంకిపాటి నాగరాజును సన్మానించారు. సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ సన్మాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యవర్గ సభ్యులు మంచెం ఉమా మహేశ్వరరావు, గాంధీ తోలేటి, జవ్వాది నాగేశ్వరరావు, డివి.ప్రసాద్, కనకరాజు పర్యవేక్షించారు.

'కళారత్న విజయం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

కెఆర్.విజయకు ఫొటో ఫ్రేమ్ అందజేస్తున్న వైట్ల కిషోర్‌కుమార్

తెలుగు సినిమా తొలి తరం నుంచి చిత్రీకరణ సాంకేతిక పరంగా స్వర్ణ యుగంగా పౌరాణికాలే ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. చెన్నయ్‌లో ప్రముఖ దక్షిణాది నటీమణి, అభినయ సౌందర్య నిలయ కెఆర్.విజయపై వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ రాసిన 'కళారత్న విజయం' పుస్తకాన్ని కెఆర్.విజయ ఆవిష్కరించినట్లు కిషోర్ కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో తమిళ సహాయ నటుడు కృష్ణమూర్తి, జె.సూర్య పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు చెక్కు అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు

వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ముఖ్యమంత్రి వరద బాధితుల సహాయ నిధికి మంగళవారం వితరణ చెక్కు అందజేశారు. రూ.1,01,217 చెక్కును బలరాం బాబు ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గంగుల రమేష్, ఆరవెల్లి వెంకట్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో
తణుకు విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - తణుకు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

హైదరాబాద్ యంగ్ ఎన్‌ఓయిస్ ఇంటర్నేషనల్ సంస్థ వారు అంతర్జాతీయ చిత్రకళ పోటీలు నిర్వహించారని, తణుకు జెడ్‌పిహెచ్ బాలుర హైస్కూల్ బాలలు అత్యున్నత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు, జ్యూరీ ప్రైజులు సాధించారని ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు వెంపటాపు మాట్లాడుతూ హంగేరి బల్గేరియా, స్లవక్కియా, స్లోవేనియా లాత్వియ, లుాట్వేనియా, మేస్డోనియా, సెర్బియా, ఇండియా దేశాల బాలలు పాల్గొన్న పోటీల్లో బాలుర హైస్కూల్ విద్యార్థులు 12 మంది బంగారు పతకాలు గెలుచుకున్నారన్నారు. మరో 24 మంది జ్యూరీ హానర్ సాధించారని తెలిపారు. డి.సాత్విక, ఎన్.లీలా నాగవైష్ణవి, యు.హైమావతి, ఎం.వందన, సిహెచ్.చరణ్, ఎస్ఎల్ నరసింహ, ఎన్.కుశల్‌ఈశ్వర్‌కుమార్, వి.షణ్ముఖశ్రీరమ్య, కె.విద్యాహాసిని, డి.జెస్సికా, శృతి, ఎం.అనూష, టి.రవిచరణ్ బంగారు పతకాలు సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పూర్వ చిత్రకళ ఉపాధ్యాయుడు వెంపటాపును ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి, స్టాఫ్ సెక్రటరీ ప్రభువరం, శైలజ, కృష్ణ, వీరభద్రం, సోమేశ్వరరావు, పెద్దిరాజు, వీరబాబు, పాపారావు, రాధా, సురేంద్ర అభినందించారు.

శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలి
ఎంఎల్ఎ అంజిబాబుకు వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎస్‌సి శ్మశానవాటిక ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి అభివృద్ధి చేయాలని ఎస్‌సి శ్మశానవాటిక పరిరక్షణ కమిటీ నాయకులు ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులును కోరారు. మంగళవారం ఎంఎల్‌ఎకు కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎస్‌సి శ్మశాన పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి నుంచి కూడా నాలుగు ఎస్‌సి పేటలు శ్మశానవాటికను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదల వల్ల తీసిన గోతుల్లోనే మరలా పూడ్చించడం జరుగుతోందన్నారు. ఈ మధ్యకాలంలో రోడ్డు వేస్తుంటే మరలా అడ్డుకున్నారని తెలిపారు. ఆర్‌డిఒ, తహశీల్దార్ సమక్షంలో హద్దులు వేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎస్‌సి శ్మశానవాటిక ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి పరిరక్షణ కమిటీ ఇంజేటి ప్రభాకర్‌రావు, ఇంజేటి శ్రీనివాస్, గోగులమండ అశోక్, ఇంజేటి చిట్టిబాబు, చిలకపాటి ఆదాము పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి డి.విశ్వనాథ్

వట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఇటీవల జరిగిన హత్యకు సంబంధించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసిన తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను విశ్వనాథ్ వెల్లడించారు. హైస్కూల్ ఆవరణలో దీపావళి నేపథ్యంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వెనుక ప్రాంతంలో అక్టోబరు 31వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ముద్దాయి కాజా నానాజీ మద్యం తాగుతుండగా అప్పటికే మద్యం తాగి ఉన్న మృతుడు కాకర్ల దుర్గారావు తనకు మద్యం ఇవ్వాలని కోరాడన్నారు. తాను ఇవ్వనని నానాజీ చెప్పగా దుర్గారావు బలవంతముగా మద్యం సీసా తీసుకుని తాగాడని, దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. దుర్గారావు తన మద్యం తాగడమే కాకుండా బూతులు తిట్టడంతో నానాజీ ఆగ్రహంతో రాయితో దాడి చేశాడని వివరించారు. ఈ క్రమంలో తాను పోలీసు కేసు పెడతాననడంతో నానాజీ మరింత విచక్షణ కోల్పోయి మరో పెద్దరాయి తీసుకొచ్చి దుర్గారావు తలపై, ముఖంపై గట్టిగా కొట్టాడని, దీంతో దుర్గారావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పరారీలో ఉన్న నానాజీని అదుపులోకి తీసుకుని విచారించగా దుర్గారావును హత్య చేసినట్లు అంగీకరించాడన్నారు. మృతుడు దుర్గారావు నిత్యం మద్యం సేవిస్తూ రోడ్ల పక్కనే ఖాళీ స్థలాల్లో నిద్రిస్తూ జులాయిగా తిరుగుతూ ఉండేవాడని, ముద్దాయి నానాజీ మండపాక పంచాయతీలో చెత్త సేకరిస్తూ, జీవనం సాగిస్తుంటాడని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మూడు రోజులుగా సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారం సరికాదని, దీనిలో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి హెచ్చరించారు. ఈ కేసును ఛేధించడంలో విశేష కృషి చేసిన తణుకు పట్టణ, రూరల్ సిఐలు కె.కొండయ్య, ఎం.కృష్ణకుమార్, తణుకు ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ, పట్టణ ఎస్ఐ కె.చంద్రశేఖర్, ఎఎస్ఐ ఎస్.శ్రీధర్, కానిస్టేబుల్స్‌ను డిఎస్‌పి విశ్వనాథ్ అభినందించారు.

సూర్యారావుపాలెం ఘటనలో
ఆరుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో గత నెల 30న జరిగిన భారీ విస్ఫోటనంలో మృతుల సంఖ్య మంగళవారానికి ఆరుకు చేరింది. బాణసంచా తయారీ కేంద్రం వద్ద చెట్లపై పిడుగుపడి చోటుచేసుకున్న విస్ఫోటనంలో తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరౌతు శ్రీవల్లి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత ఘటనా స్థలంలోనే సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని తొలుత తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. వీరిలో విప్పర్తి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రెండు రోజుల క్రితం మృతి చెందారు. మంగళవారం తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడియం కుమారి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి, మందలంక కమలరత్నం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ప్రస్తుతం ఇంకా ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు

యువకుని కిడ్నాప్

పెనుగొండ :తన కొడుకును గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని తండ్రి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ గంగాధర్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇరగవరం మండలం అయితం పూడి చెందిన కొప్పినీడి వెంకట సాయిబాబు (27) సంవత్సరాలు, అతను డిగ్రీ పూర్తి చేశాడు. పెనుగొండలో ట్యాక్స్ కన్సల్టెంట్‌గా ఆఫీసు పెట్టుకుని ఆడిట్ చేస్తూ ఉంటాడు. వెంకటసాయిబాబు డిగ్రీ చదువుతున్నపుడు ఆచంట ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. అతని కిడ్నాప్‌కు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. దీనిపై యువకుని తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనికి వెళ్లి వృద్ధుడు మృతి

ఉండి:ఉపాధి పనికి వెళ్లిన వృద్ధుడు మతి చెందిన సంఘటన ఉండి మండలం అర్తమూరు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగా రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్తమూరు గ్రామంలో ఉపాధి పనికి వెళ్లిన వృద్ధుడు పామర్తి వీరస్వామి (80) పనిచేస్తూ మృతి చెందాడని, విషయం తెలియగానే తాను సంఘటనా స్థలానికి వెళ్లి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపానని తెలిపారు. మృతునికి రావాల్సిన అన్ని సౌకర్యాలూ అతని కుటుంబానికి అందజేస్తామని తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఇరగవరం

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ఆటో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ ఆటో కార్మికులు స్వయం ఉపాధిపై ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాలో రూ.100 కోట్లు ట్యాక్స్ రూపంలో చెల్లిస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, స్పేర్‌పార్టుల ధరలు పెరగడం, ఇన్సూరెన్స్ ప్రీమియం పెరగడంతో ఆదాయం సరిపోక కుటుంబ అవసరాలు తీరని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెరిగిన ధరలను ప్రభుత్వం అరికట్టాలని, ఆటో కార్మికులు ఆటోలను కొనుగోలు చేసుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని, ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, పి.నాగరాజు, చిటికెన శ్రీనివాసు, కాసగాని సూర్య, బొక్కా శామ్యూల్, ఉప్పుల సురేష్‌బాబు, డి.కనకయ్య, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

దర్భరేవులో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని దర్భరేవు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిఎ ఇ.అనిల్‌కుమారి మాట్లాడుతూ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, పురుగు మందుల వాడకం, కలుపు యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కలిగించారు. అలానే ఇ-పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఎక్నోలెడ్జ్మెంట్ తీసుకోవాలని కోరారు. రైతులు మాట్లాడుతూ దర్భరేవు మురుగు కాలువ వల్ల పంట పొలాల్లో మురుగు నీరు ఎక్కువగా ఉండడం వల్ల పంట సాగుచేయలేక పోతున్నామన్నారు. దర్భరేవు, ఈస్ట్, వెస్ట్ కుక్కిలేరు సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విఎఎ.పవన్‌కుమార్ రెడ్డి, నల్లూరి సూర్యనారాయణ, గంటసాల సూర్యనారాయణ, గొర్ల బంగారయ్య పాల్గొన్నారు.

బిఎల్‌ఒలకు త్వరలో చెల్లింపులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గడిచిన జనరల్ ఎన్నికల్లో సేవలందించిన బిఎల్‌ఒలకు త్వరలో చెల్లింపులు ఉంటాయని, జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మిరియాల లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా డిఆర్‌ఒను మంగళవారం కలిసిన సందర్భంగా బిఎల్‌ఒలకు రావాల్సిన బకాయిల గురించి జిల్లా, రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు వారి దృష్టికి తీసుకెళ్లగా, బిఎల్‌ఒలకు సంబంధించి పాత పెండింగ్ బిల్లులు ఫైనాన్స్‌లో పెండింగ్ ఉన్నందున, మొన్న వచ్చిన జనరల్ ఎలక్షన్ ఫండ్ నుండి ప్రతి బిఎల్‌ఒకు రూ.2000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తొందర్లోనే తహశీల్దార్ల ద్వారా ప్రతి బిఎల్‌ఒకు 2,000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమంలో డిపిహెచ్ ఎన్‌ఒ వెంకటరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులను గుర్తించినప్పటి నుంచి వారికి అందించాల్సిన సేవలన్నీ ఎంసిహెచ్ కార్డులో నమోదు చేసుకుని ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆశాలకు తెలిపారు. రిజిస్టర్లు, రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా గర్భిణులకు రూ.5 వేలు అందుతాయన్నారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు అమలేశ్వరరావు, డి.కమల, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KALIPATNAPU VENKATA RATNAMALA**, W/o. Kalipatnapu Indu Sekhar Rao, Aged 71 years, Adhar No.3701 4944 6387, resident of D. No.24C-6-26, Chanikyapuri Colony, 1st Road, Ramachandraraopeta, Eluru- 534002, Eluru District, Andhra Pradesh, India hereby state as follows. My Name is **KALIPATNAPU VENKATA RATNAMALA**, W/o. Kalipatnapu Indu Sekhar Rao, and my name was wrongly mentioned in Passport as **KALIPATNAPU VENKATA RATNAM,** which was issued by Indian Passport Authorities. My name in passport shall be **KALIPATNAPU VENKATA RATNAMALA.** The name as mentioned above is true and correct. I will not change my name in future. If anything found contrary to the above statement, I will be liable for both civil and criminal actions.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No. 68/2022

అప్పిలెంట్: దూసనపూడి శ్రీదేవి

రెస్పాండెంట్లు: మైలవరపు సీతారామ్య వగైరా

పై నెంబరు ఎ.ఎస్.68/2022 అప్పీలులో రెస్పాండెంట్లు అయిన 1) మైలవరపు సీతారామయ్య, తండ్రి: లాలయ్య, డో.నెం.10-33-4ఎ/2, భాగ్యలక్ష్మీపేట, పాత 26వ వార్డు, తాడేపల్లిగూడెం, TPG XI ADJC, 5) మైలవరపు శశిరేఖ, తండ్రి: లేటు ఎం.ఎస్.నారాయణ, హౌస్ నెం.408, ఆర్.కె.రెసిడెన్సీ, మోతీ నగర్, హైదరాబాద్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అనువారికి అప్పీలు నోటీసులు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అమలు జరగనందున Substituted సర్వీసు ద్వారాను అమలు జరుపుటకు గాను **ది.19-11-2024వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున 1,5 రెస్పాండెంట్లు సదరు వాయిదా రోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టులో హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల 1,5 రెస్పాండెంట్లు పరోక్షమందు పై అప్పీలు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

S.RAMACHANDRA RAO
Advocate, Eluru.
Cell: